## క్లుప్తంగా

### వరిని ఆశించిన ఆకుముడత తెగులు

సైదాపురం: మండలంలోని రైతులు సాగు చేసిన వరిని ప్రస్తుతం ఆకుముడత తెగులు ఆశించిందని మండల వ్యవసాయాధికారిణి హైమావతి తెలిపారు. ఆమె శుక్రవారం దేవరవేమూరు, కలిచేడు తదితర గ్రామాల్లో వరి పైరును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఆకుముడత వల్ల పంట ఎదుగుదల తక్కువగా ఉంటుందన్నారు. అనంతరం తెగులు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు.

### వృద్ధులకు దుస్తుల పంపిణీ



నాయుడుపేట టౌన్ : స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఉన్న మేరీ ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు శుక్రవారం మాచర్ల వీరమల్లయ్య దుస్తులు అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. పండ్లు ఇతర వస్తువులు ఇచ్చారు. తన భార్య మాచర్ల వజ్రామణి జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం చేపట్టినట్టు వీరమల్లయ్య తెలిపారు. నిర్వాహకులు సునిత, బెన్ని, గరికి సుబ్రమణ్యం, బల్లి ముత్యాలయ్య పాల్గొన్నారు.

### దివ్యాంగునికి ట్రై సైకిల్ అందజేత



చిల్లకూరు : మండలంలోని చేడిమాలకు చెందిన రాజనేని రామా నాయుడు చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు బాబు, పవన్ శుక్రవారం నెలబల్లి రెట్టపల్లికి చెందిన మందా రమేష్‌కు ట్రై సైకిల్ అందజేశారు. అతను ప్రమాదంలో గాయపడంతో కాళ్లు చచ్చుబడ్డాయి. నడవలేని స్థితిలో ఉన్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న ట్రస్టు నిర్వాహకులు రాజనేని శ్రీనివాసులు ట్రై సైకిల్ అందజేయాలని ప్రతినిధులకు సూచించారు.

### అదుపు తప్పిన సీఐ వాహనం

దొరవారిసత్రం : వేణుంబాకం రోడ్డు సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం సీఐ వాహనం అదుపుతప్పి డివైడర్‌పై ఆగిపోయింది. తృటిలో ప్రమాదం తప్పింది. నాయుడుపేట అర్బన్ సీఐ ఎం బాబీ శ్రీహరికోట(షార్)లో బందోబస్తుకు వెళ్లి తిరిగి వస్తున్నారు. వేణుంబాకం రోడ్డు సమీపంలో వాహనం ముందు చక్రం కనెక్టింగ్ రాడ్ విరిగిపోయింది. కారు అదుపు తప్పి రోడ్డు మధ్యలోని డివైడర్‌పై ఆగిపోయింది. సీఐకి, డ్రైవర్‌కు గాయాలు కాలేదు.

### నిబంధనలు పాటించాలి

ఓజిలి: వేలంపాటలో చేపల చెరువును దక్కించుకున్న వారు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఈవోపీఆర్డీ మోహన్ తెలిపారు. మాచవరం సచివాలయంలో శుక్రవారం చేపల చెరువు వేలం పాటలు నిర్వహించారు. ఈవోపీఆర్డీ మాట్లాడుతూ చెరువులో కోళ్ల వ్యర్థాలను వేయరాదని తెలిపారు. గతంలో రెండుసార్లు వేలం పాటలను గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో శుక్రవారం సీఐ సంగమేశ్వర్‌రావు, ఎస్‌ఐలు రవిబాబు, శ్రీకాంత్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సర్పంచ్ పిండుకూరు మౌనికారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సిరాజ్, మస్తానయ్య, రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

### వృద్ధులకు ఫల సరుకులు

గూడూరు రూరల్ : వృద్ధులకు ప్రతి నెలా డాక్టర్ సీఆర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యుల సహకారంతో తోడ్పాటు ఇవ్వడం సంతోషాన్నిస్తోందని లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు, వైజేపీ లయన్స్ క్లబ్ ఫాస్ట్ రీజన్ చైర్మన్ ఆర్‌వీ రావు తెలిపారు. గూడూరులోని డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు ఫల సరుకులు అందజేశారు.

### సీజేఎఫ్ఎస్ భూములకు డీకేటీ పట్టాలు

దక్కిలి: ఎన్నో ఏళ్ల నుంచి పేదలు సాగు చేసుకుంటున్న సీజేఎఫ్ఎస్ భూములను డీకేటీ భూములుగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 16 గ్రామాల్లో సీజేఎఫ్ఎస్ భూములు ఉన్నట్లు గుర్తించామన్నారు. వాటిలో కొంతమంది పంటలు సాగు చేసుకుంటున్నారని, వారికి పట్టాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అటవీ భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులకు అటవీ చట్టం ప్రకారం హక్కులు కల్పిస్తామన్నారు.

### మట్టి తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు

బాలాయపల్లి (సైదాపురం) : మన్నూరుమిట్టలో శుక్రవారం జేసీబీ, ట్రాక్టర్‌తో మట్టి తరలింపును గ్రామస్తులు అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో కొందరు వ్యక్తులు మట్టిని తవ్వి తరలిస్తున్నారని తెలిపారు. దీనిపై పోలీసులు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. అధికారులు అక్కడికి చేరుకుని జేసీబీ, ట్రాక్టర్ యజమానులను మందలించి పంపించి వేశారు. వారిపై చర్యలు తీసుకోకపోవడాన్ని స్థానికులు తప్పుబడుతున్నారు.

### నాలుగు ఇసుక ట్రాక్టర్ల సీజ్

చిల్లకూరు : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సెబ్ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. మండలంలోని జాతీయ రహదారిపై శుక్రవారం అధికారులు తనిఖీలు చేస్తున్నారు. అటుగా ఇసుక లోడుతో వచ్చిన నాలుగు ట్రాక్టర్ల డ్రైవర్ల వద్ద అనుమతులు లేవు. దీంతో వాటిని సీజ్ చేసి పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేసినట్లు సెబ్ అధికారులు తెలిపారు.

# చెరువు కట్టలకు గండ్లు



గండిపడిన గోనుపల్లి చెరువు

**సాగునీరు పుష్కలంగా ఉంటే పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుఖంగా జీవనం సాగిస్తారు. ఈ విషయాన్ని గుర్తించిన రాజులు ప్రతి గ్రామానికీ అవకాశం ఉన్నచోట చెరువులు తవ్వించి కట్టలు కట్టించారు. వాటికి నీటిని సరఫరా చేసేలా కాలువలను ఏర్పాటుచేశారు. ప్రతి ఏటా కురిసే వర్షపు నీరు చెరువులకు చేరడం ద్వారా రైతులు పంటలు పండించుకుంటూ ఉంటారు. ఒకసారి చెరువు నిండితే మూడేళ్లు భూగర్భ జలాలకు కొదవ ఉండదని రైతులు చెబుతుంటారు. రాపూరు మండలంలోని చెరువు కట్టలు బలహీనంగా మారాయి. కొన్ని చోట్ల కట్టలు దెబ్బతిన్నాయి. వాటికి మరమ్మతులు చేయించలేదు. దీంతో వర్షం కురిసినా నీరు వృథాగా పోతుండడంతో ఆయకట్టు భూములు బీళ్లుగా మారుతున్నాయి. -రాపూరు**

- మరమ్మతులకు నోచుకోని వైనం
- వృథాగా పోతున్న వర్షపు నీరు
- బీడుగా మారిన ఆయకట్టు భూములు
- పట్టించుకోని అధికారులు

రాపూరు మండలంలో పలు చెరువు కట్టలు దెబ్బతిన్నాయి. మరమ్మతులు చేయకపోవడంతో నీరు నిలవకపోవడంతో రైతులు పంటలు పండించుకోలేకపోతున్నారు. మండలంలో 47 చెరువులు ఉండగా వాటిలో 13 పెద్ద చెరువులు, 34 చిన్న చెరువులు ఉన్నాయి. 47 చెరువుల కింద సుమారు 5,239 ఎకరాల ఆయకట్టు భూములున్నాయి. 2020లో కురిసిన భారీ వర్షానికి గోనుపల్లి చెరువు కట్టకు గండిపడింది. ఇప్పటి వరకు గండిని పూడ్చలేదు. దీంతో సుమారు 100 ఎకరాల ఆయకట్టు బీడుగా మారింది. గోనుపల్లి చెరువు గండి పూడ్చేందుకు రూ.39 లక్షలతో ప్రతిపాదనలు పంపినా ప్రయోజనం లేదు. రాపూరు కొండేరు ఆనకట్ట, పంగిలి ఆనకట్ట దెబ్బతిన్నాయి. కొండేరు ఆనకట్ట కింద రాపూరు పెద్ద చెరువు, దాబలచెరువు, ఈదల చెరువు, ఆగర్త కట్ట, ఎర్రచెరువు ఉన్నాయి. వర్షాలు కురిసినప్పుడు కొండేరు నుంచి వచ్చే వరద నీటితో ఈ ఐదు చెరువులు నిండుతాయి. నీటి ప్రవాహ ఉధృతికి కొండేరు ఆనకట్ట కొట్టుకుపోయింది. వర్షపు నీరు సైదాపురం ఏటిలోకి వెళ్లిపోతున్నట్టు రైతులు వాపోతున్నారు. కొండేరు వాగుకు మరమ్మతులు చేసేందుకు రూ.75 లక్షలు అవసరమవుతాయని అధికారులు ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరుకాలేదు. రాపూరు పెద్ద చెరువులోని ముత్యాలమ్మ తూము పూర్తి స్థాయిలో దెబ్బతినింది. ఈ చెరువు కింద ఉన్న 610 ఎకరాల ఆయకట్టు భూములు బీళ్లుగా మారాయి. ప్రపంచ బ్యాంకు నిధులు రూ.1.14 కోట్లతో పనులు చేసినా ముత్యాలమ్మ తూముకు మరమ్మతులు చేయకపోవడంతో నీరు వృథాగా పోతోంది. అదేవిధంగా పంగిలి



దెబ్బతిన్న పంగిలి ఆనకట్ట

చెరువు ఆనకట్ట దెబ్బతినింది. గుండవోలు చెరువు కింద 350 ఎకరాల భూములు ఉన్నాయి. చెరువు కట్టకు ఉన్న 2 తూములు దెబ్బతినడంతో నీరు వృథాగా పోతోంది. అలాగే ఎంపీపురం, ఆకలివలస చెరువులు కూడా దెబ్బతిన్నాయి. గొనుపల్లి, పంగిలి, గుండవోలు, ఎంపీపురం, ఆకలివలస చెరువు కట్టల మరమ్మతులకు రూ.3.30 కోట్లతో ప్రతిపాదనలు పంపినా ఇంతవరకు నిధులు మంజూరు కాలేదు.



రాపూరు పెద్దచెరువు ముత్యాలమ్మ తూము



దెబ్బతిన్నగుండవోలు చెరువుతూము



దెబ్బతిన్న రాపూరు కొండేరు ఆనకట్ట

#### గోనుపల్లి చెరువు కట్ట గండి పూడ్చాలి



గోనుపల్లి చెరువు కట్టకు నాలుగేళ్ల క్రితం గండి పడింది. వర్షపు నీరు వృథాగా పోతోంది. ఆయకట్టు భూములు నిరుపయోగంగా మారాయి. గండి పూడ్చాలని పలుమార్లు ఇరిగేషన్‌శాఖ అధికారులకు విన్నవించాం. అధికారులు ప్రతిపాదనలు పంపినా ప్రయోజనం లేదు. -నెల్లూరు రవీంద్రారెడ్డి, వ్యవసాయ సలహా మండలి మాజీ అధ్యక్షుడు, రాపూరు

#### భూమి ఉన్నా ప్రయోజనం లేదు



నాకు గోనుపల్లి చెరువు కింద 2 ఎకరాల 10 సెంట్లు భూమి ఉంది. కట్టకు గండి పడడంతో నీరు నిలవడం లేదు. భూమి ఉన్నా పంటలు పండించుకునేందుకు అవకాశం లేకుండాపోయింది. గండిపడినప్పుడు పొలంలో మట్టికోసుకుపోయింది. దాన్ని బాగు చేయాలంటే పెద్ద సమస్యగా మారింది.

-మాధమాల వెంకటరెడ్డి, పెనుబర్తి, రాపూరు మండలం

#### ముత్యాలమ్మ తూమును రిపేరు చేయాలి



రాపూరు పెద్ద చెరువు మధ్యలో ఉన్న ముత్యాలమ్మ తూము వర్షపు ప్రవాహ ధాటికి కొట్టుకుపోయింది. దీంతో నీరు వృథాగా పోతోంది. నిధులు మంజూరైనా పనులు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి తూము మరమ్మతులు పనులు చేపట్టాలి.

-పిట్టబోయిన వెంకటసుబ్బయ్య, మాజీ సర్పంచ్, రాపూరు

#### 350 ఎకరాలు బీడుగా మారాయి



గుండవోలు చెరువు కట్టకు మూడు తూములు ఉన్నాయి. రెండు దెబ్బతినడంతో వర్షపు నీరు వృథాగా పోతోంది. ఈ చెరువు కింద ఉన్న 350 ఎకరాల ఆయకట్టు భూములు బీడుగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తూములకు మరమ్మతులు చేయించాలి. -పింగాణి విశ్వనాథ్‌రెడ్డి, గుండవోలు, రాపూరు మండలం

#### ప్రతిపాదనలు పంపించాం



మండలంలోని గోనుపల్లి, పంగిలి, గుండవోలు, ఆకలివలస, ఎంపీపురం చెరువులకు రూ.3.30 కోట్లు, రాపూరు కొండేరు ఆనకట్టకు రూ.75 లక్షలు ఖర్చు అవుతుంది. మిగిలిన చెరువు కట్టల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం. -ఎస్‌కె సర్దార్, ఇరిగేషన్ ఏఈ, రాపూరు

## ప్రొటోకాల్ తప్పనిసరిగా పాటించాల్సిందే



మాట్లాడుతున్న ఎంపీడీవో సూర్యసాయి

చిల్లకూరు : పంచాయతీల్లో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు తప్పనిసరిగా ప్రొటోకాల్ పాటించాలని ఎంపీడీవో సూర్యసాయి ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ తుపాకుల వెంకటరమణమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ ఎన్నికల అనంతరం నాయకులు ఇష్టానుసారం వ్యవహరిస్తూ ప్రజా ప్రతినిధులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. స్వాతంత్ర్య దినోత్సవంలో ఎస్ఎంసీ చైర్మన్లతో జెండా ఎగుర వేయించాలని ప్రభుత్వం స్పష్టంగా చెప్పినా నాయకులు ఉపాధ్యాయులను లోబరుచుకుని అంతా తమదే పెత్తనమని వ్యవహరించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. సర్పంచులను పిలిచి అవమానించారని పేర్కొన్నారు. దీనిపై ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల్లో సర్పంచ్, ఎంపీటీసీలకు ప్రొటోకాల్ పాటించాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉన్నతాధికారులకు సిఫార్సు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జెడ్పీటీసీ మన్నెం శీనయ్య మాట్లాడుతూ 14 శాఖలపై సమీక్ష నిర్వహించేలా అజెండా రూపొందిస్తే 7 శాఖల అధికారులు రాకపోవడం దారుణమన్నారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైస్ ఎంపీపీలు వేమారెడ్డి కుమారస్వామిరెడ్డి, పోలుబోయిన చెంగయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న దీపిక, సుబ్రమణ్యం

నాయుడుపేట టౌన్ : పట్టణంలో బీఎంఆర్ నగర్‌లో తిరుపతి ఎంపీ నిధులు రూ.8.75 లక్షలతో సిమెంట్ రోడ్డు, మురుగు కాలువల నిర్మాణానికి మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక శుక్రవారం భూమి పూజ చేశారు. అంతకుముందు చైర్ పర్సన్ దీపిక, మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి తదితరులను నేతలు బైనా చంద్రశేఖర్ రెడ్డి, రాకేష్ రెడ్డి, సుబ్బారెడ్డి సత్కరించారు. వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు షేక్ జరీనా, అత్తివరం గోపాల్ రెడ్డి, వినుకొండ ధనుంజయ పాల్గొన్నారు.

**మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా ప్రశంసా పత్రం అందుకున్న నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ జనార్ధన్‌రెడ్డిని శుక్రవారం చైర్ పర్సన్ కటకం దీపిక, నాయకులు సన్మానించారు. ఇటీవల కలుషిత ఆహారం తిని తీవ్ర అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారు.

## గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని వినతి

వెంకటగిరి రూరల్ : తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గంలోని గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని గిరిజన సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు తలపల మల్లికార్జున్ కోరారు. ఆయన శుక్రవారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాతోతు హుస్సేన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో వెంకటగిరి ఆర్టీసీ డిపోలో ఏడీఈగా పనిచేస్తున్న గిరిజన ఉద్యోగి చెక్కిరాల చెంచయ్య డీఎం వేధింపులతో డిపో కార్యాలయంలోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. పోలీసుల నిర్లక్ష్యం వల్ల ఆ కేసులో పురోగతిలేదన్నారు. సీజేఎఫ్ పట్టాలున్న గిరిజనులను ఫారెస్టు అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. గిరిజన గురుకులాల్లో అధ్యాపకులు కొరత ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో యానాది గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు శ్రీమంతుల రామయ్య, చంగల్‌రాయులు, పుత్తూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

### విద్యుత్ షాక్‌తో కూలీకి గాయాలు

పెళ్లకూరు: పెళ్లకూరు వద్ద శుక్రవారం ఫ్లై ఓవర్ బ్రిడ్జికి ఇరువైపులా విద్యుత్ స్తంభాలకు దీపాలు ఏర్పాటు చేస్తుండగా షాక్‌కు గురై రంజిత్ కుమార్ అనే వలస కూలీ తీవ్రంగా గాయపడ్డాడు. 71వ జాతీయ రహదారి రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనుల్లో బీహార్ రాష్ట్రానికి చెందిన రంజిత్‌కుమార్ కూలీలతో కలిసి దీపాలు ఏర్పాటుచేస్తున్నాడు. ప్రమాదవశాత్తు 33/11 కేవీ విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో రంజిత్‌కుమార్‌కు కాళ్లు, చేతులు పలు శరీర భాగాలు తీవ్రంగా కాలిపోయాయి. అతన్ని కూలీలు హుటాహుటిన స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి తిరుపతికి తరలించే ప్రయత్నం చేశారు. 108 రాకపోవడంతో మెగా కంపెనీకి చెందిన అంబులెన్స్‌లో తిరుపతికి తరలించారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

### ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు

కోట: కోట, విద్యానగర్‌లో ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని గూడూరు డీఎస్పీ రమణకుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం కోట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రాత్రిళ్లు గస్తీ పెంచాలని ఆదేశించారు. ఎస్‌ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

**నిమ్మతోటల పరిశీలన**

రాపూరు: నిమ్మలో వేరుకుళ్లు తెగులను నివారించకుంటే పూత రాలిపోతుందని ఏవో సోమసుందరం తెలిపారు. ఆయన శుక్రవారం గిలకపాడులో నిమ్మతోటలను పరిశీలించారు. వేరుకుళ్లు నివారణకు కేజీ ట్రైకోడెర్మా విరిడి, 90 కేజీల వేప ఎరువు, 10 కేజీల వేపపిండి వారం రోజులు నీటిలో మగ్గనిచ్చి తర్వాత చెట్టు మొదలు వద్ద వేయాలన్నారు.

### జీవన ఎరువుల తయారీపై రైతులకు శిక్షణ

వెంకటగిరి రూరల్ : పెరియవరం సమీపంలో ఉన్న కేవీకేలో శుక్రవారం శాస్త్రవేత్తలు గోవిందరాజులు, తిరుపాల్ రైతులకు జీవన ఎరువులు, జీవ నియంత్రణ తయారీపై శిక్షణ ఇచ్చారు. రైతులకు జీవ ఎరువుల కారకాలను పంపిణీ చేశారు.

**విద్యార్థినికి ఆర్థిక సాయం**

గూడూరు రూరల్ : గూడూరులోని బనిగేసాహెబ్‌పేటకు చెందిన బీటెక్ విద్యార్థిని రావూరి మాధురికి శుక్రవారం పైడా నాగేంద్రరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు సిద్దేష్‌కుమార్ రూ.5 వేల సాయం చేశారు. బలిజ మహిళా సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షురాలు సారంగం సులక్ష్మీ, సభ్యులు ఇస్కా సువర్ణలక్ష్మీ, పసుపులేటి ఉమాదేవి, నీలి, ఉష, బళ్లారి రాధ పాల్గొన్నారు.

## సొంత నిర్ణయాలు ఎలా తీసుకుంటారు..?



ఎంపీడీవోకు వినతి పత్రమిస్తున్న ఉపాధి కూలీలు

చిల్లకూరు : అధికారంలో ఉన్నామని సొంత నిర్ణయాలు తీసుకుంటే గ్రామాల్లో వివాదాలు నెలకొంటాయని, వాటిని నివారించేందుకు సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని మోమిడి సర్పంచ్ లావణ్య, ఉపాధి మేట్లు తెలిపారు. వారు శుక్రవారం ఎంపీడీవో సూర్యసాయిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన ఉపాధి ప్రజావేదికలో ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగిస్తున్నట్టు అధికారులు మౌఖిక ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. అతనికి ఇప్పటి వరకు లిఖిత పూర్వక ఆదేశాలు అందలేదని తెలిపారు. అధికార పార్టీ నేతలు ఉపాధి ఏపీవో గిరితో కుమ్మక్కై ప్రజా ప్రతినిధుల ప్రమేయం లేకుండా, గ్రామసభ నిర్వహించకుండా సొంతంగా తీర్మానాలు చేసి సాధారణ మేట్‌గా పనిచేస్తున్న లలితను సీనియర్ మేట్‌గా రిజిస్టర్ చేశారని ఆరోపించారు. గ్రామంలో 10 గ్రూపుల ద్వారా రోజుకు 200 మంది పనులు చేస్తున్నారని తెలిపారు. లలితను సీనియర్ మేట్‌గా నియమిస్తే ఒక్కరు కూడా పనికి వెళ్లరని తెగేసి చెప్పారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో పూర్తి స్థాయి విచారణ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వేమారెడ్డి కుమార్‌స్వామి రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్‌గా మారిన ఆస్పత్రి



నాడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ (ఫైల్)



నేడు: పసుపు రంగువేసి అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేసిన దృశ్యం

సూళ్లూరుపేట: సూళ్లూరుపేటలోని అర్బన్ హెల్త్ క్లినిక్‌ను అన్న క్యాంటీన్‌గా మార్చారు. నిరుపేదలకు పట్టెడన్నం పెడుతున్నామని చెప్పి టీడీపీ గారడీ చేస్తూ జేబులు నింపుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. అంతేగాక రూ.ఐదుకు అన్నం పెడుతున్నామని, చాలీ చాలకుండా పెట్టి తద్వారా వచ్చే ఆదాయ వనరులను దోచుకోనున్నారని అంటున్నారు. అంటే పేదవాడు తినే అన్నం విషయంలో కూడా రాజకీయాలు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు తన పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సూళ్లూరుపేట గాండ్లవీధిలో వున్న సుమారు 40 అంకణాల స్థలాన్ని ఆ రోజుల్లో బందిలదొడ్డికని కేటాయించారు. తప్పించుకుని వచ్చిన పశువులను ఈ దొడ్డిలో వుంచి తర్వాత రైతు నుంచి ఇంత అని రుసుము వసూలు చేసేవారు. ప్రస్తుతం ఆ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పింది. వెంటనే బందిలదొడ్డి స్థలంలో సుమారు రూ.26 లక్షల మున్సిపాలిటీ నిధులతో ఈ భవనాన్ని నిర్మించారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే దోపిడీకి అడ్డాగా మారిన అన్న క్యాంటీన్లను రద్దు చేసింది. ఆ భవనంలో వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్‌ను పెట్టారు. ఈ క్లినిక్ వున్నపుడు సాయినగర్, వట్రపాళెం, గణపతినగర్, గాండ్లవీధి, వనంతోపు, మహా దేవయ్య నగర్, ఇసుకమిట్ట, కోళ్లమిట్ట, బజారు వీధి ప్రాంతాల వాసులకు ఉచితంగా వైద్యం అందించేవారు. ఈ భవనాన్ని బలవంతంగా లాక్కుని మరోమారు అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు మరో రూ.6 లక్షల మున్సిపాలిటీ నిధులు వెచ్చించారు. అర్బన్ హెల్త్ క్లినిక్‌ను ప్రభుత్వాస్పత్రిలో మెర్జ్ చేసేశారు. నిరుపేదలకు పైసా ఖర్చు లేకుండా వైద్యం చేయించుకునే వైద్యాలయాన్ని రద్దు చేసి భోజనాలయంగా మార్చు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందనే ప్రశ్న తలెత్తుతోంది. మొదటి విడతలో సూళ్లూరుపేట అన్న క్యాంటీన్ మాత్రం ప్రారంభం కావడం లేదు. దీన్ని మరోమారు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం



రాపూరు : పెంచలకోనలో నిర్వహించిన వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న మహిళలు



చిల్లకూరు : బంగారు చీరలో ముత్యాలమ్మ

సైదాపురం/కలువాయి/దక్కిలి/రాపూరు/నాయుడుపేట టౌన్ /సూళ్లూరుపేట/వాకాడు/చిల్లకూరు/గూడూరు రూరల్ : సైదాపురంలోని శ్రీబాలా త్రిపుర సుందరీదేవి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వ్రతం చేసుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. కలువాయి మండలంలోని కుల్లూరు శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలోనూ వరలక్ష్మి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. దక్కిలి మండలంలోని కోలితోటలో ఉన్న చెంచమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. లక్ష్మీ నరసింహస్వామి, చెంచులక్ష్మీ అమ్మవారి కల్యాణోత్సవం నిర్వహించారు. వెంబులూరు పంచాయతీ వెలుగొండలు కింద ఉన్న యోగలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలోనూ వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. రాపూరు మండలం పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అర్చకులు వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు. రాపూరు సమీపంలోని మసీదుపేటలో ఉన్న మహాలక్ష్మీ అమ్మవారికి విశేష పూజలు చేశారు. నాయుడుపేట మండలంలోని ఎంపీ చక్కెర పరిశ్రమ సమీపంలో ఉన్న భగవతి మల్లికాంబ ఆలయంలో సామూహిక కుంకుమార్చన, నిత్య సుమంగళి వ్రతం చేశారు. నాయుడుపేటలోని షణ్ముగ సుబ్రమణ్యేశ్వర స్వామి, వ్యూహలక్ష్మీ సమేత కల్యాణ వెంటేశ్వరస్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం చేశారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో షోడష గౌరీ వ్రతం నిర్వహించారు. తిమ్మాజి కండ్రిగ సమీపంలో స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న దుర్గా మల్లేశ్వర దేవి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం చేపట్టారు. అదేవిధంగా సూళ్లూరుపేటలోని వేంకటేశ్వరాలయం వీధిలో వున్న శ్రీ మద్వేంకట రామమూర్తి స్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. వాకాడులో వెలసిన మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం, కుంకుమ పూజ చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. సిద్దిగుంటపాళెం చతుర్భుజ మహాలక్ష్మీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో ముత్యాలమ్మ ఆలయంలో 250 మంది ఏక కాలంలో కుంకుమ పూజలు చేశారు. కలవకొండలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. భక్తులకు అన్నదానం చేశారు. ముత్యాలమ్మకు బంగారు చీరను అలంకరించారు. గూడూరులోని రాజరాజేశ్వరి ఆలయంలో మహిళలు కుంకుమ పూజ, వరలక్ష్మీ వ్రతం చేశారు.



గ్రామస్తులకు భోజనాలు వడ్డిస్తున్న పారిశ్రామికవేత్త శ్రీనివాసులు

**భక్తులకు అన్నదానం**

పెళ్లకూరు : మండలంలోని చిల్లకూరు వడ్డిపాళెంలో ఉన్న శ్రీచండికా పరమేశ్వరి ఆలయంలో కుంకుమార్చన చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త చల్లా శ్రీనివాసులు పుట్టిన రోజు సందర్భంగా గ్రామస్తులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. చల్లా వెంకటకృష్ణయ్య, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.